అయ్యా.. మీరెక్కడా..?

- నెల్లూరును అభివృద్ధి చేస్తామని నాడు హామీ
- అధికారంలోకి వచ్చి వంద రోజులైనా నేటికీ ఆ ఊసే లేదు
- నేతలు, కార్యకర్తలకు సైతం లభించని దర్శనం
- ఇదీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే నారాయణ తీరు



వీఆర్సీ సెంటర్‌లో నిర్వహించిన సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో నారాయణ (ఫైల్)

నెల్లూరు సిటీ: తాను గెలిచి.. టీడీపీ అధికారంలోకి వస్తే నెల్లూరును అభివృద్ధి పథంలో నడుపుతా.. భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలకు సంబంధించిన పనులను పూర్తి చేస్తానని ఎన్నికలకు ముందు టీడీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి నారాయణ హామీల వర్షాన్ని కురిపించారు. తీరా ఆయన విజయం సాధించి.. ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడినా నేటికీ ఆ ఊసే లేదు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా సిటీ నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పనికి పునాది నేటికీ పడలేదు. మరోవైపు ఆయన దర్శనభాగ్యమే కరువైందని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలే బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇక ప్రజల్లో పర్యటించి వారి సమస్యలను తెలుసుకోవడమనేది నేటికీ జరగకపోవడం గమనార్హం.


ప్రచార సభల్లోనూ అదే తీరు..

ఎన్నికలకు ముందు నారాయణకు మద్దతుగా నగరంలో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ రోడ్ షోను నిర్వహించారు. నెల్లూరు అభివృద్ధికి నారాయణ నిత్యం పని చేస్తారని వారు చెప్పినా, నేటికీ ఆ ఊసేలేదు.

అమరావతికే పరిమితం

టీడీపీ అధికారంలోకి వచ్చిన ఈ వంద రోజుల్లో కనీసం 15 రోజులైనా ఆయన నగరంలో లేరంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అధిక భాగం విజయవాడ, అమరావతికే ఆయన పరిమితమవుతున్నారు. పార్టీ విజయం కోసం కష్టపడిన నేతలు, కార్యకర్తలకు సైతం అందుబాటులో లేరని ఆయన వర్గమే చెప్తోంది. నారాయణ ఎప్పుడొస్తారో ఎవరికీ తెలియదు. కొందరు నేతలను లోకేశ్ వద్దకు తీసుకెళ్లి కండువాలు కప్పించడంలో చూపిన శ్రద్ధను నెల్లూరు అభివృద్ధిపై నారాయణ ఒక్క శాతం కూడా పెట్టలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత ప్రభుత్వం కంటే మిన్నగా సంక్షేమం



సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి గత ప్రభుత్వం ఇచ్చిన దానికంటే ఎక్కువగా సంక్షేమాన్ని అందిస్తాం. ప్రతి కుటుంబానికి ఎంత వస్తుందో ఇప్పుడే మీకు మెసేజ్ రూపంలో వస్తుంది.. చూసుకోండి. పింఛన్ మొత్తాన్ని పెంచుతాం. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తీసుకుంటాం. ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగ భృతిగా నెలకు రూ.మూడు వేల వంతున ఇస్తాం. బడికి వెళ్లి చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15 వేల ఇస్తాం.

– పొంగూరు నారాయణ

నెల్లూరు సిటీలో ఎన్నికల ప్రచారంలో..

ఇచ్చిన హామీలివీ..

- భూగర్భ డ్రైనేజీని పూర్తి చేసి దోమల రహిత నగరంగా తీర్చిదిద్దుతామని నారాయణ చెప్పారు.
- సంగం బ్యారేజీ నుంచి నెల్లూరులోని ప్రతి ఇంటికీ బ్లూ పైప్‌లైన్ల ద్వారా కనెక్షన్ ఇచ్చి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు.
- నగరంలోని పార్కులను ఆధునికీకరించి, ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తామని, దీనికి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తామని నమ్మబలికారు.
- నెల్లూరు నగరాన్ని గ్రీన్ సిటీగా తయారు చేస్తామని చెప్పారు. అయితే నేటికీ ఇవి పురోగతికి నోచుకోలేదు.



మా రూటే.. సెపరేటు..!

- నెల్లూరు రూరల్‌లో టీడీపీ నేతల బెదిరింపులు, దౌర్జన్యాలు
- ఇసుక, మట్టి అక్రమ రవాణాకే పరిమితం
- బెదిరిస్తూ.. టీడీపీ కండువాలు కప్పుతూ
- హామీల అమలు తూచ్
- వివాదాస్పదంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి తీరు



పార్టీ ఫిరాయించి టీడీపీలో చేరిన వారితో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (ఫైల్)



గ్రావెల్ తవ్వకాలతో కలివెలిపాళెంలో ఇలా..

నెల్లూరు సిటీ: టీడీపీ నూరు రోజుల పాలనలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో హామీల అమలు అంశాన్ని విస్మరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు, నేతలు, కార్యకర్తలపై దాడులు చేయడం, భయభ్రాంతులకు గురి చేయడానికే పరిమితమయ్యారు.

బదిలీలు, పార్టీలో చేరికలపైనే దృష్టి

టీడీపీ ప్రజాప్రతినిధులు రాజకీయాలకే పరిమితమయ్యారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పోలీసులు, అధికారుల బదిలీలపైనే దృష్టి పెట్టారు. తమకు నచ్చిన వారిని తెచ్చుకోవడానికే ప్రాధాన్యమిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నేతలను టీడీపీలో చేర్చుకోవడంలో పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోటీపడ్డారు. ఇందులో భాగంగా బెదిరింపులకు సైతం దిగుతున్నారనే ప్రచారం ఉంది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పైకి ఒకటి చెప్తూ.. లోపల మాత్రం మరోలా వ్యవహరిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించేదిలేదంటూనే దానికి పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎన్నికల వరకే రాజకీయాలు, ఆ తర్వాత అవసరం లేదని తరచూ చెప్పే ఆయన దాన్ని పాటించడంలో మాత్రం వెనుకబడ్డారు.

యథేచ్ఛగా కొల్లగొడుతూ..

పొట్టేపాళెంలో ఇసుక అక్రమ తవ్వకాలను యథేచ్ఛగా జరిపారు. నెల్లూరు చెరువులో నల్లమట్టిని నిబంధనలకు విరుద్ధంగా తవ్వారు. కలివెలపాళెం చెరువులో 15 అడుగులకుపైగా తవ్వకాలను టీడీపీ నేతలు జరిపారు. కల్లూరుపల్లి చెరువులో నల్లమట్టిని కొల్లగొట్టారు.

ఇచ్చిన హామీలు..

- పొట్టేపాళెం, ములుమూడిలో కలుజుపై వంతెనను నిర్మిస్తామని ఎన్నికలకు ముందు టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హామీ ఇచ్చారు.
- నెక్లెస్‌రోడ్డు ఆధునికీకరణతో పాటు కొండ్లపూడి, కొమ్మరపూడి, దేవరపాళెం, ఆమంచర్ల, దొంతాలి గ్రామాల్లోని పొలాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీటిని అందిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. అయితే ఇందులో ఏదీ నేటికీ ప్రారంభంకాలేదు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మాలధారణ

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని భక్తులు మాలధారణను శుక్రవారం స్వీకరించారు. సర్వాలంకారశోభితంగా కొలువైన అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈఓ వెంకటసుబ్బయ్య, ఆలయ ప్రధానార్చకుడు రఘురామశర్మ, దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్, అమ్మవారి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి రూ.50 వేల చొప్పున విరాళాన్ని కరణం దొరబాబు, రాయపనేని విజయకుమార్ ప్రకటించారు. దీనికి సంబంధించిన చెక్కును శుక్రవారం అందజేశారు. ఈఓ వెంకటసుబ్బయ్య, దేవస్థాన ప్రధానార్చకుడు రఘురామశర్మ తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలను నిగ్గు తేల్చాలి

నెల్లూరు(బారకాసు): జంతువుల కొవ్వుతో ఉండే పదార్థాలను తిరుమల లడ్డూ తయారీలో వాడారని సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారని, ఈ విషయంలో వాస్తవాలను నిగ్గుతేల్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి కోరారు. ఈ మేరకు నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.

సేవలు ఆదర్శనీయం

నెల్లూరు(బృందావనం): నిరాధార బాలలకు విశ్రాంత ప్రభుత్వాధికారులు, ఉద్యోగులు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు పేర్కొన్నారు. వనంతోపు సమీపంలోని జనహిత వాత్సల్య ఆశ్రమంలో గల నిరాధార బాలబాలికలకు రూ.పది వేల విలువైన నిత్యావసర సామగ్రి, తినుబండారాలు, పిండి వంటలను కేంద్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాంబశివరావుకు మానవసేవే మాధవసేవ టీమ్ నిర్వాహకులు శుక్రవారం అందజేశారు. అనంతరం పలువుర్ని సత్కరించారు. విశ్రాంత జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ శ్రీనివాసులు, లక్ష్మీప్రసన్న, వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు పరిమళ, ఇందిర, జయశ్రీ, ప్రమీల, గుల్షన్, ప్రఫుల్ల, అరుణారాణి, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కల్పం శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఖాదర్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి వినతి

నెల్లూరు (టౌన్): సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఎస్జీటీలను హైస్కూళ్లకు డిప్యుటేషన్‌పై పంపడంతో ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయని, ఇందులో ఉపాధ్యాయులను నియమించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ రామారావుకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. ఉపాధ్యాయులకు పదోన్నతులను జరిపే ప్రతిసారి అర్ధరాత్రి వరకు సీనియార్టీ జాబితాలను మారుస్తూ కౌన్సెలింగ్‌ను గందరగోళంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ బాధ్యులు కృష్ణారెడ్డి, జుల్ఫికర్ అలీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌ను రూపొందించండి



మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నెల్లూరు సిటీ, పరిసర ప్రాంతాలను ఆధునిక హంగులతో తీర్చిదిద్దేందుకు అవసరమైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని నుడా వైస్ చైర్మన్ సూర్యతేజ ఆదేశించారు. గాంధీ నగర్‌లోని నుడా కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అలసత్వం వహించకుండా విధులను నిర్వర్తించాలని సూచించారు. ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఆదేశించారు. సెక్రటరీ లక్ష్మి, పరిపాలనాధికారి ఈశ్వరరాజు, ప్లానింగ్ అధికారి సుబ్బారావు, గణాంకాధికారి హేమలత, స్పెషల్ తహసీల్దార్ పెంచలరెడ్డి, ఈఈ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కళానీరాజనం రేపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో బయ్యా వెంకటరమణయ్య, సరోజనమ్మ కళానీరాజనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నామని నిర్వాహకుడు కేతా సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను శోధన్‌నగర్‌లోని సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్రంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. నాట్యాచార్య డేగల సాంబశివరావు, రమణయ్య, మల్లికార్జున, శారద, శైలజ, రజిత పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

నెల్లూరు(బారకాసు): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా పక్వాడా మహోత్సవంలో భాగంగా నగరంలోని రాజేంద్రనగర్‌లో మహిళలకు ముగ్గుల పోటీలను శుక్రవారం నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు పాల్గొన్న వారికి స్టీల్ టిఫిన్ బాక్సులను అందజేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నేతలు బాబు, శ్రీనివాసులు, పెంచలయ్య, ఖాదర్, మస్తాన్, హేమంత్, సాయికుమార్, చెంగయ్య, కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

‘బాలాజీ’లో ఐ ఫోన్ 16 విడుదల

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని బాలాజీ మొబైల్స్‌లో యాపిల్ ఐ ఫోన్ 16 సిరీస్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సంస్థ జీఎం రవి మాట్లాడారు. క్రెడిట్ కార్డు, బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేసే వారికి రూ.ఆరు వేల వరకు క్యాష్ బ్యాక్‌ను ఇవ్వనున్నామని వివరించారు. ఐ ఫోన్ 16 సిరీస్‌ను కొనుగోలు చేసిన వారికి యాపిల్ ఎయిర్‌పాడ్స్, వాచీలపై భారీ డిస్కౌంట్‌ను ఇవ్వనున్నామని వెల్లడించారు. బాలాజీ సంస్థ టీఎస్ఎంలు మనోజ్‌కుమార్, వెంకీ, మేనేజర్లు హరిప్రసాద్, కల్యాణ్, నాగూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ జయప్రదానికి పిలుపు

నెల్లూరు(అర్బన్): చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ సంబరాలను జయప్రదం చేయాలని జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉదయ్‌భాస్కర్, కృష్ణారెడ్డి కోరారు. ఈ మేరకు నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో గల వేదిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం వారు మాట్లాడారు. 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించనున్నామని చెప్పారు. పాఠశాల స్థాయిలో ఈ నెల 25న, మండల స్థాయిలో అక్టోబర్ ఒకటిన, జిల్లా స్థాయిలో 27న, రాష్ట్రస్థాయిలో నవంబర్ 9, 10న పరీక్షను నిర్వహించనున్నామని తెలిపారు. విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. విద్యాచరణ్ తదితరులు పాల్గొన్నారు.

23న పింఛనర్ల సమావేశం

నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ నెలవారీ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించనున్నామని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వెంకయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని టౌన్‌హాల్లో నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

ఎంఈఓలు, హెచ్‌ఎంలను సస్పెండ్ చేయాలి

నెల్లూరు (టౌన్): మధ్యాహ్న భోజన కార్మికులను అకారణంగా తొలగిస్తున్న టీపీగూడూరు, వెంకటాచలం ఎంఈఓలు.. ఇస్కపాళెం, అనికేపల్లి పాఠశాలల హెచ్‌ఎంలను సస్పెండ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి రెహనాబేగం డిమాండ్ చేశారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఎదుట ధర్నాను శుక్రవారం చేపట్టారు. డీఈఓ రామారావుకు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం ఆమె మాట్లాడారు. వీరిని విధుల్లోకి తీసుకునేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు శివకుమారి, జిల్లా కమిటీ సభ్యులు రమమ్మ, వరలక్ష్మి, శీనమ్మ, పార్వతి పాల్గొన్నారు.



108 ఆలయాలకు చీర, సారె సమర్పణ

నెల్లూరు(బృందావనం): దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గల 108 అమ్మవారి ఆలయాలకు ధూపదీప నైవేద్యాల కోసం చీర, సారెతో పాటు అవసరమైన పూజా సామగ్రిని అందజేయనున్నామని కాశీనాయన ఆశ్రమ నిర్వాహకుడు ధన్వి శ్రీనివాస్ పేర్కొన్నారు. మైపాడు రోడ్డులోని వైకుంఠపురంలో గల కాశీనాయన ఆశ్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. అర్చక పురోహితుడు సంతోష్ శర్మ, ఆశ్రమ సేవకులు మహంకాళి వెంకటేష్, బాణాల నాగూర్, సిద్ధు, వైష్ణవి, వెంకటేష్, మాధవరావు, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నిరసన

నెల్లూరు(దర్గామిట్ట): వాహనాల డ్రైవింగ్ టెస్ట్, ఫిట్‌నెస్ టెస్ట్‌ను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌పోర్ట్ వర్కర్లు కలెక్టరేట్ వద్ద ధర్నాను శుక్రవారం చేపట్టారు. అనంతరం కలెక్టరేట్లోని అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు.

నిరుద్యోగ భృతికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): వేద విద్యను అభ్యసించి జిల్లాలో నిరుద్యోగులుగా ఉన్న వారికి నిరుద్యోగ భృతి కింద రూ.మూడు వేలను అందజేసేందుకు గానూ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులు తమ పూర్తి వివరాలు, ఆధార్ నంబర్ తదితర సమాచారంతో పూర్తి చేసిన దరఖాస్తులను ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని దేవదాయ శాఖ జిల్లా అధికారి కార్యాలయంలో ఈ నెల 27లోపు అందజేయాలని సూచించారు.

అంధుల పాఠశాలలో అన్నదానం

నెల్లూరు(అర్బన్): నగరంలోని పొరెడ్డి రోశమ్మ అంధుల పాఠశాల విద్యార్థులకు అన్నదానాన్ని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ సేవా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య, కమిటీ సభ్యులు రమేష్‌కుమార్ ఆచారి, వంజివాక శ్రీనివాసులు, రాజేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డయాబెటిస్ రాష్ట్ర కాన్ఫరెన్స్ రేపు

నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ డయాబెటిస్ ఫెడరేషన్ 33వ రాష్ట్ర కాన్ఫరెన్స్‌ను దర్గామిట్టలోని హోటల్ మినర్వా గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం నిర్వహించనున్నామని సంఘ నిర్వహణ కార్యదర్శి డాక్టర్ మాధవ్ పావులూరు తెలిపారు. నగరంలోని ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వైద్య నిపుణులు హాజరుకానున్నారని చెప్పారు.

‘ఇది మన ప్రభుత్వం’పై అవగాహన కల్పించాలి

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో నిర్వహించనున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ సూర్యతేజ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 26 వరకు కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

రెండో రోజూ కొనసాగిన పోటీలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థల ఉద్యోగుల ఇంటర్ సర్కిల్ క్రీడా పోటీల్లో భాగంగా టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీలను నెల్లూరు క్లబ్‌లో శుక్రవారం రెండో రోజు నిర్వహించారు. టెన్నిస్ పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన మోహన్‌పై నెల్లూరు జిల్లా విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి విజయం సాధించారు.

ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

నెల్లూరు(దర్గామిట్ట): నిత్యం విధి నిర్వహణలో ఉండే ఉద్యోగులు తరచూ ఆరోగ్య పరీక్షలను చేయించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్, డాక్టర్ రాజశేఖర్ ఐ హాస్పిటల్ సౌజన్యంతో శుక్రవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఉద్యోగులకు ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించిన వైద్యురాలు జ్యోతిని సత్కరించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు వంద మందికిపైగా ఉద్యోగులు నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ చిరంజీవి, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు లక్కాకుల పెంచలయ్య, రమేష్‌బాబు, కొండయ్య, భీమిరెడ్డి, భరణి పాల్గొన్నారు.

బదిలీల కౌన్సెలింగ్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని మెప్మా ఉద్యోగులకు సంబంధించిన బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియను కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో శుక్రవారం నిర్వహించారు. కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు తదితరులకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర జరిపారు.

స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలకు కమిటీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో పీసీ, పీఎన్డీటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో భాగంగా స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని డీఎంహెచ్ఓ పెంచలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీలో జిల్లాస్థాయి అధికారులతో పాటు ప్రోగ్రామ్ ఆఫీసర్లు పది మంది ఉంటారని చెప్పారు. వీరికి కేటాయించిన స్కానింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పది రోజుల్లో నివేదికను ఇవ్వనున్నారని వివరించారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. స్కానింగ్ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లతో పాటు రేట్ల వివరాలను తెలిపే బోర్డులను ప్రదర్శించాలని సూచించారు. గర్భిణుల వివరాలను ఫారమ్ – ఎఫ్‌లో సంబంధిత పోర్టల్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

‘అపోలో’లో అడల్ట్ వ్యాక్సినేషన్ సెంటర్

నెల్లూరు(అర్బన్): నగరంలోని హరనాథపురంలో గల అపోలో సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో అడల్ట్ వ్యాక్సినేషన్ సెంటర్‌ను ఫైజర్ సంస్థ ప్రతినిధులతో కలిసి ఆస్పత్రి నిర్వాహకులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ మాట్లాడారు. న్యూమోకోకల్, ఇన్‌ఫ్లూయెంజా, హ్యూమన్ పాపిల్లో వైరస్, హెపటైటిస్ ఏ, బీతో పాటు నివారించగల అన్ని వ్యాధులకు ఇక్కడ టీకాలను అందుబాటులో ఉంచామని వివరించారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. న్యూరాలజీ హెచ్ఓడీ బిందుమేనన్, డాక్టర్లు చక్రవర్తి, భక్తవత్సలరెడ్డి, దినేష్‌రెడ్డి, ఎమ్మెస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయకుమార్‌రెడ్డిని కలిసిన నేతలు





నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డిని కొత్తవెల్లంటికి చెందిన పార్టీ నేతలు శుక్రవారం కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలను తెలియజేశారు. నేతలు కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శివకుమార్‌రెడ్డి, లీలామోహన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, అంకయ్య, క్రాంతికుమార్, అనిల్‌కుమార్, ఉపేంద్ర, సుందరం తదితరులు పాల్గొన్నారు.

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డిని చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు హంస రెడ్డి, నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

నెల్లూరు (టౌన్): సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ రామారావు కోరారు. నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల హాస్టల్ విద్యార్థినులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్లు, లోన్‌యాప్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు కరుణకుమారి, శ్రీదేవి, హాస్టల్ కమిటీ సభ్యులు ప్రసన్న, పూర్ణచంద్రకుమారి, సూపర్‌వైజర్ యమున, కేర్ టేకర్ గౌతమి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులను చేపట్టనున్న క్రమంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిసాన్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని డీఎస్‌నగర్, పెన్నార్ ఫీడర్లలో మరమ్మతుల కారణంగా జాకీర్‌హుస్సేన్‌నగర్, కిసాన్‌నగర్, వేణుగోపాల్‌నగర్, సింహపురికాలనీ, ప్రశాంతినగర్, మూడో మైలు తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

- నవాబుపేట మార్కెట్ యార్డ్ సబ్‌స్టేషన్ పరిధిలోని నవాబుపేట, నజీర్‌తోట, పుల్లమ్మసత్రం, కుసుమ దళితవాడ, ముకుందపురం, రామచంద్రాపురం తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.
- జనార్దన్‌రెడ్డి కాలనీ ఫీడర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో ఉదయం ఎనిమిది నుంచి నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

నెల్లూరు(దర్గామిట్ట): తిరుమలలో లడ్డూ ప్రసాద తయారీలో అపవిత్రత విషయమై కలెక్టరేట్ ఎదుట ధర్నాను నవ నిర్మాణ సేన ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. అనంతరం డీఆర్వో లవన్నకు వినతిపత్రాన్ని సమర్పించారు. తుళ్లూరు రాము, కుమార్, వినోద్, విజయ, సూర్య, క్రాంతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.